మైదుకూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

రక్తమోడిన రహదారులు

పీలేరులో పికప్ వాహనాన్ని ఢీకొన్న కర్నాటక బస్సు

నిలబడి ఉన్న లారీపైకి దూసుకెళ్లిన తుఫాన్ వాహనం

రోడ్డు ప్రమాదంలో మృతులు..

మూడు ప్రమాదాల్లో ఏడుగురు మృతి
ఒకరి పరిస్థితి విషమం, 8 మందికి గాయాలు
భీతావహంగా మారిన ఏరియా ఆస్పత్రి ప్రాంగణం

మృతులు విమలమ్మ, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి (నంద్యాల జిల్లా) కె.విజయ్‌కుమార్, ఇర్షాద్ (పీలేరుకు చెందిన వారు)(ఫైల్ ఫోటోలు)

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లా పీలేరు చుట్టూ ఉన్న జాతీయ రహదారులు రక్త మోడాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రహదారులపై మూడు చోట్ల వేర్వేరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఏడుగురు వ్యక్తులు దుర్మరణం చెందగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. మరో ఎనిమిది మంది గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళితే...నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన 12 మంది భక్తులు, తిరువన్నామలైలో పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనేందుకు తుఫాన్ వాహనంలో శుక్రవారం రాత్రి 10.30 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరారు. వారి వాహనం శనివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో పీలేరు-చిత్తూరు జాతీయ రహదారిపై పీలేరు పట్టణ శివారులోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సమీపంలో బ్రేక్ ఫెయిలై రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో నంద్యాల పట్టణంలోని సాయిరాం నగర్‌కు చెందిన చింతల ప్రతాప్‌రెడ్డి(43), ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న ట్రాన్స్కో ఉద్యోగి వందల నాగన్న యాదవ్ సతీమణి వందల విమల (52), అదే కాలనీకే చెందిన రామ్మోహన్ భార్య నేతి లక్ష్మీదేవి (58), నంద్యాల గాండ్ల కొత్తూరుకు చెందిన శివ స్వామి జీవిత భాగస్వామి గాండ్ల శివమ్మ (44) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అదే వాహనంలో ప్రయాణిస్తున్న మరో 8 మంది గాయపడగా వారిని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుల్లో నలుగురిని మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

పీలేరు -మదనపల్లి మార్గంలోని కొండారెడ్డి మిషన్ మలుపులో శనివారం ఉదయం మదనపల్లి వైపు నుంచి వస్తున్న లగేజ్ వాహనాన్ని తిరుపతి నుంచి బాగేపల్లికి వెళుతున్న కర్నాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో పీలేరు, సరోజినీదేవి వీధికి చెందిన ముబారక్ కుమారుడు ఇర్షాద్ (29) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు, స్థానిక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాలనీకి చెందిన కె.విజయ్ కుమార్ (52) తీవ్రంగా గాయపడడంతో అతన్ని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిసింది. పీలేరు సిఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ నరసింహుడు, కల్లూరు సిఐ ఆశీర్వాదం, ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలాలకు చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

శుక్రవారం రాత్రి అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం, వెలిగల్లు పంచాయతీ, ఇందుకూరు వాండ్లపల్లికి చెందిన కృష్ణయ్య (50) అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో వైద్యం చేయించుకుని, తిరిగి వస్తూ పీలేరులో తన సన్నిహితుడైన కె.వి.పల్లి మండలంలోని బొప్పసముద్రంకు చెందిన శేషాద్రి నాయుడును కలిశాడు. ఇరువురూ వాహనంలో గాలివారిపల్లికి బయలుదేరారు. పీలేరు మండలం, పొంతలచెరువు క్రాస్ సమీపంలో పీలేరు- కడప జాతీయ రహదారిపై ఆ వాహనాన్ని లారీ ఢీకొనడంతో గాయపడిన కృష్ణయ్యను శేషాద్రి నాయుడు పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు.

పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణం భీతావహంగా మారింది. మృతుల బంధువుల ఆర్తనాదాలతో ఆసుపత్రి మార్మోగింది. మూడు ప్రమాదాల్లో ఏడుగురు వ్యక్తులు మృతి చెందడంతో స్థానికులకు కూడా ఆసుపత్రికి చేరుకుని గుమిగూడారు. మృతుల కుటుంబాలను తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించి తమ సానుభూతిని ప్రకటించారు. అనంతరం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పలువురు నాయకులు కూడా ఆసుపత్రికి చేరుకుని మృతుల బంధువులను కలిసి ధైర్యం చెప్పారు. చిత్తూరు రోడ్డులో జరిగిన ప్రమాద స్థలాన్ని చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి సందర్శించి వెళ్లారు.

బాధితుల బంధువులను పరామర్శిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

పసుపు, కెపి ఉల్లికి శాశ్వత పరిష్కారం

మైదుకూరు బహిరంగ సభలో లోకేష్

ప్రజాశక్తి-చాపాడు

మైదుకూరు నియోజకవర్గంలో వ్యవసాయం మీద ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారని ఇక్కడి ప్రధాన పంటలైన పసుపు, ఉల్లి, వరి రైతుల సమస్యలకు టిడిపికి అధికారంలోకి రాగానే శాశ్వత పరిష్కారం చూపుతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచించారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభను నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజోలి ఆనకట్టను నిర్మిస్తామని శిలాఫలకం వేసి నాలుగు సంవత్సరాలు పూర్తయినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. బిసిలు పడుతున్న కష్టాలు నేను చూసానని 26 వేల అక్రమ కేసులు, నిధులు, కుర్చీలు లేని కార్పొరేషన్లు ఇచ్చారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపకులాల వారీగా నిధులు, బిసిల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. డాక్టర్ సుధాకర్ దగ్గర నుండి డాక్టర్ అచ్చెన్న వరకూ జగన్ పాలనలో దళితుల్ని కిరాతకంగా చంపారన్నారు. దళితుల్ని చంపడానికి జగన్ వైసిపి నాయకులకు స్పెషల్ లైసెన్స్ ఇచ్చాడన్నారు. 27 దళిత సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసాడన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులను వేధించిన వారిని కఠినంగా శిక్షిస్తామని జగన్ రద్దు చేసిన 27 దళిత సంక్షేమ కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, తెలుగుగంగ కాలువ, కెసి కెనాల్, నిప్పులవాగు కాలువల సామర్థ్యాన్నిపెంచుతామని హామీ ఇచ్చి జగన్ మరిచారన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తామని ఇచ్చిన ఒక్క హామీ నిలబెట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. గత టిడిపి హయాంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజ్ ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో కాలేజీలు, కమ్యూనిటీ భవనాలు కట్టింది టిడిపి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ఆయన కుమారుడు మహేష్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఉల్లి రైతులు

ఉల్లి రైతులు యువనేత లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో పండించే విదేశీరకం కెపి ఉల్లి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు. కెపి రకం ఉల్లి ఎకరా పంటకు 15 నుండి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. క్వింటాకు రూ.10 వేలు ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని, ఆగష్టు నెలలో ఉల్లి కొనుగోలు కేంద్రం పెట్టి కొనుగోలు చేయాలన్నారు. దళారులు పంట కొనుగోలు చేయడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఉల్లి రైతులకు న్యాయం చేయాలని కోరగా నారా లోకేష్ స్పందిస్తూ టిడిపి అధికారంలోకి వచ్చాక మైదుకూరులో ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి రైతులను ఆదుకుంటామని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, దళారీల దోపిడీ బారినుంచి కాపాడతామని పేర్కొన్నారు. ఉల్లి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందజేస్తామని హామీ ఇచ్చారు.

రైలు ప్రమాదంపై కంట్రోల్ రూమ్ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఒడిషా రాష్ట్రంలో బాలాసుర్ జిల్లాకు సమీపంలో హౌరా-చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12841), బెంగళూర్-హౌరా ఎక్స్ప్రెస్ (12864) రైలు ప్రమాద దుర్ఘటన జరగడం చాలా బాధాకరమని ఈ ఘటనపై జిల్లాకు సంబంధించి ఏదేని సమాచారం అందజేయడానికి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ గిరీష తెలిపారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒడిశాల్లో రైలు ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరమని, రైలు ప్రమాదంలో చాలా మందికి గాయాలయ్యాయని, చాలామంది మృతి చెందడం చెందారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టరేట్లకు ఈ దుర్ఘటనపై సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారని అన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి ఎవరైనా ఈ ప్రమాదంలో ఉంటే తక్షణమే కుటుంబ సభ్యులు సంప్రదించాలన్నారు. అలాగే వారికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. అందులో భాగంగా అన్నమయ్య జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు తరచూ మాట్లాడుతూ ఉన్నామన్నారు. ఎవరైనా జిల్లా ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రైల్వే శాఖతో కూడా సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడూ సమాచారాన్ని తెలుసుకుంటున్నామన్నారు. జిల్లాల ఎవరైనా ట్రైన్లో ప్రయాణం చేసి ఉంటే ఎటువంటి సమాచారం ఉన్న సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామని అన్నారు. 08561-293006లో సంప్రదిస్తే అధికార యంత్రాంగం సహాయంగా ఉంటారన్నారు. ఒడిశాలో అక్కడ అధికారులతో మాట్లాడి అన్ని సహాయక చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పర్మన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

9న మదనపల్లెలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళ డిగ్రీ కళాశాల, మదనపల్లిలో ఈనెల 9న నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరిషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో బహుళజాతీ కంపెనీలకు చెందిన కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లామా, డిగ్రీ, బిటెక్, ఫార్మసీ, ఎంఫార్మసీ, బిఎస్‌సి, ఎంబిఎ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. జాబ్ మేళాలో 500 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారున్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయసు కల్గిన వారు అర్హులన్నారు. ఎంపికైనా అభ్యర్థులకు నెలకు రూ. 10 వేల నుంచి 30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8897776368, 7799587687లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ గోపినాథ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

టిడిపి అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి : ఎంపీ

కురబలకోట: టిడిపి అసత్య ప్రచారాలను తిప్పి కొడుతూ వైసిపిని అధికారంలోకి తీసుకురావడానికి మరోసారి సోషల్ మీడియా సభ్యులు సైనికుల్లా పనిచేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని జడ్పీ హైస్కూల్లో ప్రాంగణంలో వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో సోషల్ మీడియా ప్రజా జీవితంలో అంతర్భాగంగానే కాకుండా నిత్యావసరంగా మారిందని పేర్కొన్నారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన తంబళ్లపల్లె నేడు అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. తంబళ్లపల్లెలో వేసినన్ని రోడ్లు రాష్ట్రంలో మరెక్కడా వేయలేదన్నారు. టిడిపి నిర్వాకంతో కుట్ర పూరితంగా ఆగిన ముదివేడు ఇతర రిజర్వాయర్ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రజలకు సమస్యలు ఉంటే ఎమ్మెల్యేతో పాటు తన దృష్టికి కూడా తీసుకు రావచ్చన్నారు. తంబళ్లపల్లెలో పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని ఇక్కడి వారు చాలా మంది తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఎంత చేసినా ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు. సోషల్ మీడియా సేవలు వెలకట్టలేనివన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సిఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఊరూ వాడా చెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలతో పాటు సోషల్ మీడియా చురుకైన పాత్ర పోషించాలని కోరారు. నియోజక వర్గ పరిశీలకులు ఇరగమ్‌రెడ్డి ఉమ్మడి జిల్లా గ్రానైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కారదరెడ్డి, జడ్‌పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి, బి.కొత్తకోట మహేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉర్దూ ఉపాధ్యాయులకు శిక్షణ

రాయచోటి టౌన్ : ఉమ్మడి కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని డిఎస్‌సి-2018 ఉర్దూ ఉపాధ్యాయులకు ఈనెల 5న ఇండక్షన్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపల్, కడప డిఇఒ వై.రాఘవరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక డైట్ కళాశాలలో 9వతేది వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో మానసిక, శారీరక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేందుకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడంలో శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 2018 డిఎస్‌సి ద్వారా ఎంపికై వివిధ మేనేజ్‌మెంట్ల కింద పనిచేస్తున్న ఉర్దూ ఎసిటి ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా శిక్షణాతరగతులకు హాజరుకావాలని కోరారు

ఏరియా ఆస్పత్రిలో అదనపు డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక ఏరియా ఆస్పత్రిని అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుష్టు వార్డును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వార్డులో నెలకు ఎంతమంది పరీక్షలు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఎంత మంది చికిత్స పొందుతున్నారన్న వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఐసిటిసి కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేసి వ్యాధి గ్రస్తులకు మందులు సక్రమంగా వాడుతున్నారా లేదా అన్న వివరాలను సేకరించారు. రోగుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ వారికి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. టిబి సూపర్వైజర్ జయప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీను, కౌన్సిలర్ సుబ్బయ్య, జగన్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న అదనపు డిఎంహెచ్‌ఒ శైలజ

పాఠశాల సరే.. అనుమతులు ఎక్కడ..?

అక్రమంగా ప్రయివేటు పాఠశాల ఏర్పాటు
తమకేం తెలియదంటున్న అధికారులు
నిద్రమత్తులో జిల్లా యంత్రాంగం

వాల్మీకిపురం బైపాస్ రోడ్డులో నిర్మించిన ప్రయివేటు పాఠశాల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఏలాంటి అనుమతులు లేకపోయినా రాజకీయాన్ని పలుకుబడిని ఉపయోగించి తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని ఇష్టానుసారంగా రోడ్డుకు ఆనుకొని ప్రయివేటు పాఠశాలను ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. అక్రమ మార్గమైనా అంతా సక్రమంగా చేసేస్తామన్నట్లు వాల్మీకిపురం పట్టణంలో ఓ ప్రయివేట్ పాఠశాల భవనాలు వెలిశాయి. వివరాలలోకి వెళితే... గుర్రంకొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి వాల్మీకిపురం బైపాస్ రోడ్డులో ప్రయివేటు పాఠశాల భవనాలు నిర్మించి ఎంచక్కా ప్రారంభించి బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల భవనాలు ఎక్కడో లేదు.. సరిగ్గా మండల విద్యాశాఖ కార్యాలయం ఎదురుగానే నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. పాఠశాల ఏర్పాటుకు అనుమతులు కావాలంటే తొలుతగా మండల విద్యాశాఖ అధికారి నుండి తప్పనిసరి అనుమతులు ఉండాలి. అనుమతుల తరువాత పాఠశాల భవనాల నిర్మాణం, సౌకర్యాలు అన్నీ కూడా అధికారుల ఆదేశాల మేరకు ఉండేలా చూడాలి. స్థానిక మండల విద్యాశాఖ అధికారుల అనుమతులు కాదు కదా కనీసం కార్యాలయంలో కూడా అధికారులను సంప్ర దించకపోవడం విడ్డూరం. గత కొద్ది నెలలుగా నిర్మాణాలు జరుగుతుంటే ఏదో అనుకున్న అధికారులు కూడా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. రెండు రోజుల క్రితం స్కూల్ పేరిట భవనాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయ్యడం, గురువారం రోజున పాఠశాల ప్రారంభం కూడా పూర్తి చేసి పట్టణంలో ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టారు. కాగా నిర్మాణాలు చేపట్టిన స్థలాలు కూడా నగారా ఎద్దుఇనాం పేరిట కోర్టులో ఉండటం, నిర్మాణం ప్రారంభంలో సమీప గొల్లపల్లె గ్రామస్తులు అడ్డుపడి గొడవపడినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ పంచాయతీ నుండి అనుమతులు, తాగునీటి కుళాయి, కరెంట్ మీటర్ తదితరం అన్నీ వచ్చిన తరువాత నిర్మాణాలు పూర్తి చేసి చివరలో పాఠశాల బోర్డులు ఏర్పాటు చేశారు. ఒకవేళ విద్యాశాఖ అనుమతులు పొందితే సౌకర్యాలు పూర్తి స్థాయిలో ఉండేలా చూసుకుంటారు. ఇక్కడ మాత్రం సరిగ్గా రోడ్డుకు అర అడుగు దూరంలో పాఠశాల భవనాలు అదికూడా సిమెంట్ ఇటుకలు, రేకులతో తరగతి గదులను నిర్మించారు. పాఠశాల యజమాన్యానికి చెందిన వ్యక్తి తాను ఓ పత్రికా విలేకరినని, అంతే కాక అధికార పార్టీ అండ కూడా ఉందని బెదిరింపులకు కూడా పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా నిత్యం అటుగా వెళ్లే విద్యాశాఖ అధికారులు గానీ, మరే ఇతర అధికారులు కూడా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోకపోవడం గమనార్హం. సరిగ్గా రోడ్డుపై నిర్మించిన పాఠశాల భవనాలు ఒకవేళ అనుమతులు ఉన్నా విద్యార్థులకు ప్రమాదకరమే అని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పాఠశాల నిర్మాణాలపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

విద్యాశాఖ నుండి పాఠశాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. జిల్లా విద్యాశాఖ అధికారుల నుండి కూడా పాఠశాలకు అనుమతులు ఇచ్చినట్లు తమకు సమాచారం అందలేదు. అక్రమంగా నిర్మాణాలు, పాఠశాల నిర్వహణ జరిపితే విచారణ చేపట్టి జిల్లా అధికారులకు నివేదిక అందిస్తాం.

- వెంకటరత్నం, ఎంఇఒ, వాల్మీకిపురం.

మాన్యంను ఆక్రమించుకున్నారు

శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థానమునకు చెందిన నగారా ఎద్దు ఇనాం మాన్యంను అక్రమార్కులు అక్రమంగా ఆక్రమించుకొని నిర్మాణాలు చేశారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నా రాజకీయ ప్రోద్బలంతో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టి అనుమతులు లేకుండా పాఠశాల ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి అక్రమ కట్టడాలను తొలగించి, నగారా ఎద్దు ఇనాం మాన్యంను స్వాధీన పరుచుకోవాలి.

- నల్లకాసుల రామకృష్ణ, గొల్లపల్లి, వాల్మీకిపురం.

పాఠశాలను సీజ్ చేయాలి

పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇనాం భూముల్లో దురాక్రమణకు పాల్పడి యథేచ్ఛగా ప్రయివేటు పాఠశాలను ఏర్పాటు చేయడం అధికారులకు తెలియకుండా నిర్మాణం చేయడం సాధ్యం కాదు. విద్యా, రెవెన్యూ అధికారులు ఆక్రమణ దారులతో కుమ్మక్కైనందు వలనే పాఠశాల నిర్మాణం జరిగినా చోద్యం చూస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకొని, అక్రమంగా నడుపుతున్న పాఠశాలను సీజ్ చేయాలి. దురాక్రమణకు పాల్పడినందుకు గానూ కేసులు కూడా నమోదు చేయాలి. లేనిపక్షంలో ప్రత్యేక్ష ఆందోళనకు దిగుతాం.

- శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

విజ్ఞాన శిబిరాన్ని సందర్శించిన కరాటే సురేష్

విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల్లో ఉల్లాసాన్ని నింపిందని యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కరాటే గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎఆర్.సురేష్ కితాబునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు నైనారు మధుబాల ఆదేశాల మేరకు మదనపల్లె శాఖా గ్రంథాలయం నందు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయనతోపాటు శిష్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు కరాటే నేర్చుకోవడంలో ఉన్న ఉపయోగాల గురించి వివరించారు. అదేవిధంగా విద్యార్థులు విద్యతోపాటు కరాటేలో శిక్షణ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో తమన తామరక్షించుకోవచ్చునన్నారు. మలేషియాలో జరిగిన కరాటేలో పోటీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన మాస్టర్ షేక్ మిస్బా కరాటేలోని కొన్ని విన్యాసాలు చేసి చూపించగా పిల్లలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గ్రంథాల అధికారిణి ఆర్.వసంత కుమారి, రామ్మూర్తి హెడ్ కానిస్టేబుల్, మోటివేటర్ యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి, చీఫ్‌కోచ్ ఎం.మణి సాయి, కరాటే మాస్టర్ షేక్‌మిస్బా పిల్లలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి తీరు దారుణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చాలా దారుణంగా ఉందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు.శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఒడిశా రాష్ట్రం బాలాషోరులో జరిగిన రైలు ప్రమాద సంఘటన తీవ్ర విషాదకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం ఆదాయ వనరులను పరిగణలోకి తీసుకొని, ప్రజల అభివృద్ధి అవసరాలను విస్మరించారని ఆరోపించారు. రైల్వే ప్రమాద ఘటనకు కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో నాయకులు మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ,జీవన్ కుమార్ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ఎల్లటూరు శ్రీనివాసరాజు

అంకాలమ్మ ఉత్సవాలకు నేతల విరాళాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో శుక్రవారం నుంచి జరుగుతున్న అంకాలమ్మ తిరుణాల ఉత్సవాలలో శుక్రవారం, శనివారాలలో వైసిపి, జనసేన నాయకులు పాల్గొని విరాళాలను అందజేసి తమ సహృదయాన్ని చాటుకున్నారు. ఇటీవల జనసేన పార్టీలోకి చేరిన ఎల్లటూరు శ్రీని వాస రాజు లక్షరూపాయలు, అతికారి దినేష్ రూ.50 వేలు, పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బావమరిది గాలివీటి మదన్‌రెడ్డి రూ.50 వేలు విరాళాలు అందించారు. ఉత్సవ నిర్వాహకులు నాయకులకు బైక్‌ర్యాలీతో, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైసిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విత్తన మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కలికిరి

గుంటూరు లామ్‌లో నిర్వహించనున్న విత్తన మహోత్సవంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండు రంగ తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్న ఉద్దేశంతో ఈనెల 12వ ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విత్తన మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విడుదలైన వరి, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెగింజ పంటల్లో 58 మేలైన రకాలు ప్రదర్శనగా పెట్టి వాటిని రైతులు విక్రయించడానికి అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. విత్తన మహోత్సవాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రక్తదానం అభినందనీయం

ప్రజాశక్తి-సుండుపల్లి

ఒడిస్సా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో క్షతగాత్రులకు రక్తదానం చేయ డానికి వెయ్యిమందికి పైగా యువకులు ముందుకు అభినందనీయమని సంఘసేవకులు, డాక్టర్ సయ్యద్ అహ్మద్ పేర్కొన్నారు. ఒడిస్సా రాష్ట్రంలోని భద్రక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రక్తదానం చేయ డం కోసం యువత స్వచ్ఛందంగా తరలి వెళ్లడం సంతోషకరమన్నారు. యువత బాధ్యతగా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే దేశంలో రక్త కొరత ఉండదని తెలిపారు. తాను ఇప్పటి వరకు43 సార్లు రక్తదానం చేశానని, 43 వేల మందికి పైగా బాధితులకు ప్రత్యక్షంగా, పరోక్షంగాను రక్తం అందించానని తెలిపారు.

క్రీడాకారులను పరిచయం చేసుకున్న శ్రీనివాసరాజు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-నందలూరు

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఎపి టిడ్కో విశ్రాంత సిఎఒ యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. శనివారం స్థానిక క్రీడా మైదానంలో కుమ్మరపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్‌టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలు ద్వారా సమాజంలో ఎటువంటి సంక్షోభాలనైనా ధైర్యంగా ఎదుర్కొంటారన్నారు. క్రీడాకారులు ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో క్రీడా మైదానం అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ముందుంటానన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్, టిడిపి బిసిసెల్ స్టేట్ సెక్రటరీ సమ్మెట శివప్రసాద్, మాజీ ఎంపిటిసి మాడపూరి శ్రీరాములు, తోట శివశంకర్, ఆర్గనైజర్లు రంజిత్, దీపు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఒడిశాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఘోర ప్రమాదం అత్యంత దురదృష్టకరమని, బాధాకరమని రైల్వే కోడూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి, రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య పేర్కొన్నారు. గోసాల దేవి మాట్లాడుతూ రైలు ప్రమాదంలో వందల సంఖ్యలో మృతి చెందారని, గాయపడిన వారిని మెరుగైన వైద్యం అందించాలని మృతుల ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. బాధిత కుటుంబాలకు ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించడంతో పాటు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా నిలవాలని తెలిపారు. చనిపోయిన ప్రతి కుటుంబానికి 20 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి : 'మేడా'

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వం అందించే సబ్సీడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి స్వాతి ఆధ్వర్యంలో ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన అర్హులైన రైతులందరికీ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి కే6 24, నారాయణి రకం 600 క్వింటాళ్లు వచ్చినట్లు ఎఒ తెలిపారు. అనంతరం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమంలో ల్గొని మాట్లా డారు. సభను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మన జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన సచివాలయ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ వాలంటీర్లు ప్రజలకు, అధికారులకు మధ్య వారధులుగా ఉంటూ, ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పథకాలను అందిసూమ్త దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని కొని యాడారు. సేవారత్న, సేవామిత్ర అవార్డులు పొందిన వాలంటీర్లకు శాలువాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి సురేష్ బాబు, జడ్‌పిటిసి శివరాం, వైసిపి నాయకులు వీరనాగిరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** స్థానిక వెలుగు సభా భవనంలో వ్యవసాయఅధికారి కిషోర్ నాయక్‌తో కలిసి మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి రైతులకు విత్తనకాయల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఇప్పటికే రెండు వేల క్వింటాళ్ల వేరు శనగ విత్తన కాయలు అందు బాటులో ఉన్నాయని, ప్రతి గ్రామంలోనూ రైతులు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలలో పేరు నమోదు చేసుకొని విత్తనం కాయలు పొందవచ్చని అన్నారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతమన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, సిద్ధకనాగిరెడ్డి, కాలాడి జనార్ధన్‌రెడ్డి, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్‌లు రాజారెడ్డి, రాజబాబు, వైసిపి నాయకులు లక్ష్మిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, నారద, ఎఇఒలు కేరోలిన్, సాయి, రైతులు పాల్గొన్నారు. **కలికిరి :** స్థానిక మండల కేంద్రంలోని నాలుగవ రైతు భరోసా కేంద్రంలో ఎంపిపి వేంపల్లి నూర్జహాన్,జడ్‌పిటిసి పద్మజా, లోకవర్ధన్ ఆధ్వర్యంలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాలనుపంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులకు అందజేసి అవసరానికి సరిపోయే విధంగా వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎఒ మమతారెడ్డి, ఆర్‌బికె సిబ్బంది రాజేష్, నాయకులు రత్న శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వీరబల్లి : వేరుశనగ విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి : 'బత్యాల'

నెలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ఇటీవల వీచిన పెను వడగాలులకు పండ్లతోటలు నేలకొరిగి తీవ్రంగా నష్టపోయిన రైతుల వివరాలపై అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు అందించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వరదయ్యగారిపల్లి, మేకవారిపల్లి, వెంకటపల్లి చవన వారిపల్లి తదితర గ్రామాలను సందర్శించి ఆ గ్రామాలలో నేలకొరిగిన అరటి తోటలను పరిశీలించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్, ఆర్‌డిఒ, ఉద్యాన ఎలక్ట్రికల్ అగ్రికల్చర్ అధికారులకు ఫోన్ చేసి వెంటనే ఈ గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం జరిగిన గ్రామాల్లో సుమారు 500 ఎకరాల అరటి తోటలు 15 కరెంటు స్తంభాలు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, నేలమట్టమై నిర్వీర్యంగా పడి ఉన్నాయని అన్నారు. సంబంధిత అధికారులు వీటన్నిటిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు..!

పాఠశాల ఎదుట గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-గాలివీడు

తమ పిల్లలు చదువుకునే పాఠశాలలో వివాదాస్పద ప్రధానోపాధ్యాయుడు నియమించవద్దని శుక్రవారం గ్రామస్తులు పాఠశాల ఎదుట నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే గాలివీడు మండల కేంద్రం పెద్దూరులోని స్థానిక ఉర్దూ హైస్కూల్‌కు పెనగలూరు మండల ఎన్ఆర్ పురం జడ్‌పిహెచ్‌ఎస్ హెడ్మాస్టర్ ఇ.కృష్ణానాయక్‌ను ప్రధానో పాధ్యాయులుగా విధుల్లో చేరవలసిందిగా ఉత్తర్వులు ఇవ్వడాన్ని గ్రామ స్తులు అడ్డుకుంటున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈయన విధులు నిర్వ హించిన చోట విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉన్నతాధికారుల చర్యలకు బాధ్యుడయ్యాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తిని నియమించడాన్ని వ్యతిరేకి స్తున్నా మన్నా రు.హెడ్మాస్టర్ నియామక ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని గాలివీడు-1 ఎంపిటిసి తాజున్నీషా, మాజీ సర్పంచ్ రియాజ్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. తమ గ్రామంలోని ఆడబిడ్డల చదువుతో పాటు వారి రక్షణను దృష్టిలో వుంచుకుని హెడ్మాస్టర్ నియామకాన్ని అడ్డుకుంటున్నామని తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లామని స్పష్టం చేశారు.

పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చంద్రబాబువి మోసపూరిత హామీలు :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గత టిడిపి ప్రభుత్వంలో మోసపూరిత హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచిన చంద్రబాబు తన మేనిఫెస్టో ద్వారా ఎన్ని హామీలు ఇచ్చిన ఎవరూ నమ్మరని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సిఎమహాల్, రామ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, ఆయా కుటుం బాలకు చేకూరిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలు గులు నింపేం దుకు వైసిపి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, ప్రజల్లో సిఎం జగన్ పరిపాలనకు మంచి స్పందన లభిస్తోందన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎంతో మహత్తరమైనదని, ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి గడపకు వెళ్లి ప్రజల బాగో గులను తెలుసుకునేందుకు మంచి అవకాశం ఏర్పడిం దన్నారు. కార్య క్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, విద్యుత్‌శాఖ ఎఇ జాకీర్, నాయకులు చింతల శివానందరెడ్డి, బిడ్డల కేశవరెడ్డి, నీళ్ల భాస్కర, అబ్దుల్ కలీమ్, నరసింహులు, శ్రీనివాసులు, రాయుడు, శ్రీధర్ రాయల్, రమేష్, రఘు, ఖాదరి, చికెన్ మస్తాన్, సైపుల్లా, మాబు, షాహిద్, అహ్మద్‌బేగ్ పాల్గొన్నారు.

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే

పర్యావరణ పరిరక్షణే మన కర్తవ్యం

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి కేడెట్స్ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువ రాజ్ మాట్లాడుతూ పర్యావరణం అంటే అర్థం భూమి, నీరు, గాలి, చెట్లు, జీవజంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని, ఇది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం అని అన్నారు. భారతీయ మహర్షులు పర్యావరణాన్ని రెండు రకాలుగా అభివర్ణిం చవచ్చని, ఒకటి మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యా వరణమని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

తంబళ్లపల్లి : స్థానిక తంబళ్లపల్లె ఎపి మోడల్ స్కూల్ నుంచి 2022-23 సంవత్సరంకుగాను ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు ఐదురుగు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కొండప్పగారికావ్య శ్రీచరణ్ తేజ్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, పల్లవి, షేక్ వాహిద్‌లను ఎంఇఒ త్యాగరాజు, చైర్మన్ సలీం అభినందించారు.

తాగునీటి సమస్యపై దృష్టి : ఎంపిపి

కలకడ : తాగునీటి సమస్యపై దృష్టి సాధించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. మండలంలోని బాటవారిపల్లి సచివాలయంలో సెక్రటరీ షబానాభాను ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలన పట్టించాలని వైఎస్ఆర్ బీమా యాప్‌లో వివరాలు అన్ని వాలంటీర్స్ అందరు త్వరగా పూర్తి చేయాలని, నీటి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సంక్షేమ పథకాలు అందరికి అమలు అయ్యే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. వచ్చిన ప్రజలతో సామరస్యంగా సమధానం చెప్పాలని అన్నారు. అటెండెన్స్ రిజిస్టర్, మూమ్మెంట్ రిజిస్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పీలేరు : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పీలేరు నియోజక వర్గానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి యం.సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం పీలేరు పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ హంద్రీ-నీవా ప్రాజెక్టు నుంచి శ్రీనివాసపురం, అడివిపల్లి, పీలేరు రిజర్వాయర్లకు నీటిని తీసుకొస్తామని, తద్వారా పీలేరు నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నీటితో నింపి కళకళలాడేలా చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలు నీటి మూటలు అయ్యాయని అన్నారు.కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నరసింహులు, ఏపి రైతు సంఘం నాయకులు పరదేశి రెడ్డి, ఏఐటియూసి నాయకులు శ్రీరాములు, కరీముల్లా పాల్గొన్నారు.

కేంద్రం వైఫల్యంతోనే రైలు ప్రమాదం : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఘోర రైలు ప్రమాదం పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శనివారం పట్టణంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. మృతులకు, గాయపడినవారికి పెద్ద మొత్తంలో నష్టపరిహారం అందించాలని కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకే పట్టాలపై ఆనుకోకుండా రెండు రైళ్ళు వస్తే ప్రమాదం జరుగకుండా నిరోధించే కవచ్ టెక్నాలజీ సిస్టం గురించి రైల్వేశాఖ గొప్పగా చెప్పిందని, ప్రచారం చేసిందని, నేడు ఏమైందని ప్రశ్నించారు. గాయపడిన వారికి రక్తం ఇచ్చేందుకు సిద్ధపడటం, సహాయక చర్యల్లో పాల్గొనేందుకు స్థానికులు వందల సంఖ్యలో ముందుకు రావడం మానవత్వాన్ని సూచిస్తున్న గొప్ప విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. **రాజంపేట అర్బన్ :** యావత్తు దేశమే నివ్వెరపోయే విధంగా రైలు ప్రమాద దుర్ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బిజెపి కేంద్ర మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైలు ప్రమాద ఘటనకు మానవ తప్పిదాలే కారణమని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. **రాయచోటి:** ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో చోటు చేసుకున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎస్.అల్లా ప్రకాష్ సిఎల్‌పి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మృతుల కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, అంగవైకల్యం చెందిన వారికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి ఖదీర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకష్ణ, ఆర్‌టిఐ చైర్మన్ అమీర్ బాష, పట్టణ అధ్యక్షులు ఖాదర్ ఖాన్ , యూత్ అధ్యక్షుడు దినకర్, ఖాదరవల్లి, వసీం పాల్గొన్నారు. అన్నమయ్య డిసిసి మైనార్టీ అధ్యక్షులు, ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ రైలు ప్రమాద దుర్ఘటన పట్ల విచారం వ్యక్తంచేశారు.



రిలే దీక్షలలో ఉద్యోగ సంఘాల నాయకులు

ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపిజిఇఎ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్దూరుకస్పాలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ, పెద్దూరు కస్పాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు శనివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల అబిప్రాయం మేరకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. ముందుగా అమ్మవారిని భక్తి శ్రద్ధలతో మేడ దర్శించుకున్నారు.ార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాలివీటి రాజేంద్ర నాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాంగౌడ్, వైసిపి నాయకులు వీరనాగిరెడ్డి, గాలివీటి మదన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రమేష్ రెడ్డి, బాబు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు నాగభూషణం, రవికుమార్, నారా యణరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, మంత్రిశివారెడ్డి, అమృత నాయుడు, వీరబల్లి మండలం జెసిఎస్ కన్వీనర్ నరేష్‌స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో ?

-పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని మడితాడు గ్రామపంచాయతీలోని జికెరాచపల్లి నుంచి కురవపల్లి వరకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా బహుదానది ఒడ్డుపై నుంచి వెళ్లాల్సి వస్తోందని, నీరు ఎక్కువ రావడంతో ఈ దారి నుంచి వెళ్లాలన్నా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ దారిన వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోందని అంటున్నారు. ఇక్కడ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు చేయించి రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాకపోకలు సాగిస్తున్న బహుదానది దారి

బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 19న నిర్వహించనున్న రాయలసీమ బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగంధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ సభాభవనంలో జిల్లా స్థాయి కరపత్రాలను విడుదల చేశారు. సభకు ముఖ్యఅతిథులుగా బిఎస్‌పి నేషనల్ కో-ఆర్డినేటర్ అకాశానంద్, రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, ఉపాధ్యక్షుడు బందెల గౌతం పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల బిఎస్‌పి అధ్యక్ష, కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు హాజరై విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో న్యాయవాది నాగేశ్వరరావుతో పాటు జిల్లా. నియోజవర్గ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు నాటుసారా నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఆరిపెంటదిన్నె క్రాస్ వద్ద నాటు సారా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సంబేపల్లి మండలం పెద్దబిడికి చెందిన చక్రినాయక్ కుమారుడు అన్నానాయక్, బుక్కే రెడ్డినాయక్, కుమారుడు బుక్కేయశ్వంత్‌నాయక్ అనే ఇద్దరు 20 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 20 నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడులలో యోగేష్, ప్రతాప్, డ్రైవర్ రమేష్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పురుగుల మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు. పట్టణంలోని ఎకె.ఫంక్షన్‌హాల్ సమీపంలో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు 108 సమాచారంతో హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి డి.శ్రీనివాసులు(35)గా పోలీసులు గుర్తించారు.ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని, ఆత్మహత్యకు గల కారణాలను దర్యాప్తులో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

మృతి చెందిన శ్రీనివాసులు

కారు, ట్రాక్టర్ ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

కారు ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి సుల్వ గాయాలైన సంఘటన మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాతికుంటపల్లి పంచాయతీ గుర్రంకొండ-కలకడ రోడ్డు మార్గంలో కోన క్లాస్ వద్ద ఇసుకనోడుతో ట్రాక్టరు వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అదే మార్గంలో ట్రాక్టర్ వెనుకవైపున గుర్రంకొండ నుంచి కారు వస్తుండగా ఇసుక లోడుతో వస్తున్న టాక్టరు కోన క్రాస్ వద్ద పాపిరెడ్డిగారిపల్లి వైపు తిరగడంతో వెనుక వస్తున్న కారు ట్రాక్టర్ ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ తల్లకిందులుగా పడిపోవడంతో, కారు ప్రమాదానికి గురైంది. ట్రాక్టర్ డ్రైవర్లు భాస్కర, నాగభూషణం నాయుడు ఇరువురికి స్వల్ప గాయాలు కావడంతో స్థానిక వైద్యశాలలో చికిత్స తరలించిన స్థానికులు తెలిపారు.

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి మలుపు వద్ద శనివారం తెల్లవారు జామున కడప నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ కరెంటు స్తంభం ఢీకొనడంతో స్తంభం రెండు ముక్కలైంది. స్థానిక విద్యుత్ అధికారి లక్ష్మీనరసయ్య రాజు సంబంధిత అధికారులకు ఘటన గురించి తెలియజేసి రోడ్డులో పడి ఉన్న 11 కెవి వైర్ల నుంచి గ్రామ ప్రజలకు ఎటువంటి హాని కలగకుండా, వాహన దారులకు ఎటువంటి హానికగలకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా అప్రమత్తం చేశారు. ఈ ఘటనపై గ్రామస్తులు లక్ష్మీనరసరాజును అభినందించారు.